క్లుప్తంగా

చిన్నారులకు పరామర్శ

మహేశ్వరం: నాగుల్‌దోని తండాలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్య అంగోత్ నిర్మల మృతి చెందగా.. భర్త సంజు నాయక్ తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీంతో అనాథలైన వారి పిల్లలను కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నర్సింహారెడ్డి మంగళవారం పరామర్శించి, ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గాంసీరామ్ నాయక్, గోవింద నాయక్, సేవ్యా నాయక్, సేనావత్ రాజు నాయక్, దశరథ నాయక్, నారాయణ, కుమార్ పలువురు పాల్గొన్నారు.

ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు



ఆలయంలో కొలువుదీరిన అమ్మవారు

తుక్కుగూడ: శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది. అమ్మవారికి ఇష్టమైన రోజు మంగళవారం కావడంతో భక్తులు ఉదయం నుంచే బారులు తీరారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు, కానుకలు చెల్లించుకున్నారు. ఆలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు చేశారు. అనంతరం ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ ట్రస్టీ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, సిబ్బంది కాశీనాథ్, పూజారులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ కార్పొరేషన్ ఉపాధ్యక్షుడు సస్పెండ్

మీర్‌పేట: పార్టీకి నష్టం కలిగేలా వ్యవహరించిన కార్పొరేషన్ ఉపాధ్యక్షుడు ఓర్సు స్వామికుమార్‌ను బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి ఆదేశాల మేరకు పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు ఆ పార్టీ మీర్‌పేట కార్పొరేషన్ అధ్యక్షుడు పెండ్యాల నర్సింహ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

'ఉపాధి' పనుల పరిశీలన

తలకొండపల్లి: ఉపాధిహామీ నిధులను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ కిష్టమ్మ అన్నారు. ప్రజల కోరిక మేరకు పనులు చేపట్టి గ్రామాభివృద్ధికి కృషి చేయాలన్నారు. చుక్కాపూర్‌లో మంగళవారం ఉపాధిహామీ పథకంలో చేపట్టిన పనులపై జీపీ కార్యాలయ ఆవరణలో సామాజిక తనిఖీ గ్రామసభ నిర్వహించారు. 2019 డిసెంబర్ నుంచి 2023 మార్చి వరకు చేపట్టిన పనుల గురించి రికార్డులను పరిశీలించి, 189 పనులు చేపట్టినట్లు గుర్తించారు. కార్యక్రమంలో డీఆర్పీ శ్రీశైలం, ఉప సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి చంద్రశేఖర్, ఫీల్డ్ అసిస్టెంట్ చిన్నారెడ్డి, టీఏ తానయ్య, మాజీ ఎంపీటీసీ యాదయ్య, వార్డు సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

జేపీఎస్‌లను పర్మినెంట్ చేయాలి

కడ్తాల్: జూనియర్ పంచాయతీ కార్యదర్శుల నాలుగు సంవత్సరాల శిక్షణ కాలం పూర్తి అయినందున ప్రభుత్వం వెంటనే రెగ్యులరైజ్ చేస్తూ జీఓ జారీ చేయాలని తెలంగాణ పంచాయతీ సెక్రటరీస్ ఫెడరేషన్ కందుకూర్ డివిజన్ అధ్యక్షుడు మహ్మద్ జావిద్ కోరారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ.. 2019లో నిర్వహించిన నియామక పరీక్షల్లో పేర్కొన్న విధంగా 3 సంవత్సరాల ప్రొబేషన్ పీరియడ్‌తో పాటు, అదనంగా పెంచిన మరో సంవత్సరం ఈ నెల11తో ముగిసిందన్నారు. జేపీఎస్‌లను క్రమబద్ధీకరిస్తూ, నాలుగు సంవత్సరాల ప్రొబేషన్ కాలాన్ని సర్వీస్ కాలంగా లెక్కించాలని, ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను కూడా పర్మినెంట్ చేయాలని కోరారు. క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు చేరే విధంగా చూస్తూ, గ్రామాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న తమను రెగ్యులర్ చేసి, జూనియర్ పంచాయతీ కార్యదర్శుల కుటుంబాల్లో వెలుగు నింపాలని ప్రభుత్వాన్ని కోరారు.

ప్రశ్నించే గొంతుకను అణచివేస్తున్న ప్రభుత్వం

వైఎస్సార్‌టీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అర్జున్‌రెడ్డి



ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న వైఎస్సార్‌టీపీ నాయకులు

ఆమనగల్లు: ప్రశ్నించే గొంతుకను రాష్ట్ర ప్రభుత్వం అణచివేస్తుందని వైఎస్సార్‌టీపీ కల్వకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి చీమర్ల అర్జున్ రెడ్డి ఆరోపించారు. న్యాయంకోసం పోరాడుతున్న పార్టీ అధినేత వైఎస్ షర్మిలను పోలీసులు అక్రమంగా అరెస్టుచేశారని ఆయన మండిపడ్డారు. ఆమె అరెస్టుకు నిరసనగా పట్టణంలో మంగళవారం జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా అర్జున్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రశ్నపత్రాలు లీకేజీ అయితే ప్రశ్నించడం తప్పా అని ప్రశ్నించారు. ప్రజాసమస్యలపై ప్రశ్నిస్తే సమాధానం చెప్పాల్సిన ప్రభుత్వం.. అరెస్టు చేస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ ప్రతినిధులు నరేశ్, శ్రీను, రాజు, రమేశ్ పాల్గొన్నారు.



చిన్నతూప్రలో బీఆర్‌ఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు



దబిల్‌గూడలో..

గ్రామగ్రామాన గులాబీ రెపరెపలు

బీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండాలు ఆవిష్కరించిన శ్రేణులు

మహేశ్వరం: అధికార పార్టీ బీఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గ్రామాల్లో పార్టీ శ్రేణులు గులాబీ జెండాలను ఆవిష్కరించారు. కొళ్లపడకల్, ఆకన్‌పల్లి, ఘట్టుపల్లి, దిలావార్‌గూడ, సుభాన్‌పూర్, దుబ్బచర్ల, కల్వకోల్, అమీర్‌పేట్, చిన్నతూప్ర, గొల్లూరు, మాణిక్యమ్మగూడ, నాగిరెడ్డిపల్లి, నాగారం, నందుపల్లి, పడమటి తండా, మన్సాన్‌పల్లి, దబిల్‌గూడ, మహేశ్వరం, ఉప్పుగడ్డ తండా, కేసీతండా, పెండ్యాల, ఎన్డీతండా, తుమ్మలూరు, సిరిగిరిపురం, హర్షగూడ, మొహబ్బత్‌నగర్ పలు గ్రామాల్లో జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు.



అమీర్‌పేట్‌లో..



మన్సాన్‌పల్లిలో..

బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన ఆలయం



మత్స్యావతార వేంకటేశ్వర స్వామి దేవాలయం



వేంకటేశ్వర స్వామి (ఇన్‌సెట్లో)

28 నుంచి మే 7వరకు ఉత్సవాలు

మీర్‌పేట: దేశంలోనే ఉత్తర ద్వారంలో వెలసిన ఏకైక దేవాలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. జిల్లెలగూడ పురాతన శ్రీ మత్స్యావతార వేంకటేశ్వరస్వామి ఆలయ అధ్యయనోత్సవాలు, బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు దేవాలయ కార్యనిర్వాహక అధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 28, 29, 30 తేదీల్లో అధ్యయనోత్సవాలు, మే 1నుంచి 7వరకు స్వామివారి బ్రహ్మోత్సవాలు, మే 3న శ్రీవారి తిరు కల్యాణోత్సవం, 5నుంచి 7వరకు రథోత్సవాలతో పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుపనున్నట్లు చెప్పారు. వందల ఏళ్ల చరిత్ర కలిగిన ఆలయంతో పాటు ఉత్తర ద్వారం ద్వారా స్వామివారు దర్శనమిచ్చే ఏకైక దేవాలయం కావడంతో ఏటా భక్తులు అధిక సంఖ్యలో ఉత్సవాల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకుంటారని, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఈఓ తెలిపారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

బీఆర్‌ఎస్ పార్టీ జెండా ఆవిష్కరణలో నేతలు

హుడాకాంప్లెక్స్: ప్రజా సంక్షేమమే బీఆర్‌ఎస్ ప్రభుత్వ లక్ష్యమని, సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా కార్యకర్తలు కృషి చేయాలని సరూర్‌నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ పారుపల్లి అనిత అన్నారు. అంబేడ్కర్‌నగర్ చౌరస్తాలో పార్టీ జెండాను ఆవిష్కరించి కార్యకర్తలతో ర్యాలీగా ప్లీనరీకి వెళ్లారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బేర బాలకిషన్, నాయకులు ఇంటూరి అంకిరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, సిరిపురం రాజేష్, మల్లేశ్, శ్రీనివాస్, సుధామా, రాజు, నాగమణి, ప్రత్యూష తదితరులు ఉన్నారు.

ప్లీనరీకి గులాబీ శ్రేణులు

మీర్‌పేట: బాలాపూర్‌లో నిర్వహించిన పార్టీ ప్లీనరీకి మీర్‌పేట కార్పొరేషన్ నుంచి బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు వెళ్లారు. ప్రశాంతిహిల్స్ చౌరస్తాలో డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి పార్టీ జెండాను ఆవిష్కరించి ర్యాలీ ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సిద్దాల బీరప్ప, నాయకులు రాజ్‌కుమార్, దర్శన్, శరణ్, జీవన్, శ్రీను, రవి, రంజిత్ తదితరులు ఉన్నారు.



హుడాకాంప్లెక్స్: జెండా ఆవిష్కరణలో మాజీ కార్పొరేటర్ అనిత తదితరులు



మీర్‌పేట: పార్టీ జెండా ఆవిష్కరణలో డిప్యూటీ మేయర్ విక్రంరెడ్డి తదితరులు

పనులు చేద్దామంటే పైసలు లేవు

సర్వసభ్య సమావేశంలో సభ్యులు



సమావేశంలో మాట్లాడుతున్న ఏఈ రమేశ్. చిత్రంలో ఎంపీపీ, వైస్ ఎంపీపీ, ఎంపీడీఓ

కందుకూరు: పనులు చేద్దామంటే పైసలు లేవని, పెండింగ్ బిల్లులు విడుదల చేయడం లేదని, ఖాతాలను నిలుపుదల చేయడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పలువురు సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీపీ మంద జ్యోతి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో సర్పంచులు పలు సమస్యలపై గళమెత్తారు.

స్కూల్ పేరు మార్చినా చర్యలు శూన్యం!

విద్యుత్, పించన్ల సమస్య పరిష్కరించాలంటూ ఎంపీటీసీలు మల్లేశ్, పద్మ, సర్పంచ్ ప్రభాకర్ సభ దృష్టికి తెచ్చారు. గౌతమీ స్కూల్‌ను చైతన్యగా పేరు మార్చి నిర్వహించడంపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ఎంపీపీ జ్యోతి ఎంఈఓను ప్రశ్నించారు. పీఎం కిసాన్ పథకానికి సంబంధించి ఈకేవైసీ చేయిస్తున్నారని సర్పంచ్ మల్లారెడ్డి, ఐకేపీ నుంచి పనిముట్లు, వడ్డీ లేని రుణాలపై పలువురు ఎంపీటీసీలు ప్రశ్నించారు. ఉపాధి కూలీలకు త్వరగా కూలి డబ్బులు ఇవ్వాలని, వ్యవసాయానికి అనుసంధానం చేయాలని, బెల్టుషాపులను మూసివేయాలంటూ పలువురు సభ్యులు సభదృష్టికి తేగా.. సంబంధిత అధికారులు సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకట్రాములు, తహసీల్దార్ మహేందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ శమంత ప్రభాకర్‌రెడ్డి, ఎంపీటీసీలు జ్యోతి, రాజమ్మ, ఎల్లారెడ్డి, పద్మ, మల్లేశ్, యాదయ్య, సర్పంచులు సోమ్లానాయక్, మల్లారెడ్డి, ప్రభాకర్, అధికారులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. ఎవరైనా గుండెపోటుకు గురైతే సీపీఆర్ ఏ విధంగా చేయాలో డాక్టర్ హరినాథ్.. ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బందికి అవగాహన కల్పించారు.

వీఓఏల సమస్య పట్టని ప్రభుత్వం



కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలుపుతున్న వీఓఏలు

కందుకూరు: సమస్యలు పరిష్కరించాలని వీఓఏలు చేస్తున్న సమ్మె మంగళవారంతో 9వ రోజుకు చేరుకుంది. తహసీల్దార్ కార్యాలయం నుంచి మండల చౌరస్తా వరకు కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. అనంతరం కార్యాలయాల ఆవరణలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాలరాజు మాట్లాడారు. తొమ్మిది రోజులుగా సమ్మె చేస్తున్నా.. ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, సమస్య పరిష్కరించకపోతే ముందుగా కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తామని, ఆ తర్వాత ప్రభుత్వ కార్యక్రమాలను అడ్డుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో వీఓఏల సంఘం నాయకులు సరస్వతి, రేణుక, శారద, మౌనిక, సబిత, పద్మ, కవిత, రజని, గీత, రాధ, మాధవి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

మలేరియాపై అవగాహన సదస్సు



ఇబ్రహీంపట్నంలో అవగాహన ర్యాలీ

ఇబ్రహీంపట్నం: ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ఇబ్రహీంపట్నంలో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ కప్పరి స్రవంతి, డిప్యూటీ డీఎంహెచ్ఓ ధరణికుమార్‌లు మాట్లాడుతూ మలేరియాకు కారణమైన దోమలు వృద్ధి చెందకుండా తీసుకోవాల్సిన చర్యలను మున్సిపల్ సిబ్బందికి వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ యూసుఫ్, వైద్యాధికారిణి సరిత పాల్గొన్నారు.

సీపీఆర్‌పై శిక్షణ

గుండెపోటుకు గురైన వారికి సీపీఆర్ చికిత్స అందిస్తే అత్యవసర ప్రతిస్పందన సామర్థ్యాలు మెరుగుపడతాయని, తద్వారా రోగి ప్రాణాలు కాపాడవచ్చునని డిప్యూటీ డీఎంహెచ్ఓ ధరణికుమార్ అన్నారు. ఈ సందర్భంగా మునిసిపల్ సిబ్బందికి సీపీఆర్, ఏఈడీలపై అవగాహనతో పాటు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో కమిషనర్ యూసుఫ్, ఎంహెచ్ఓ అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు

అధికారులతో కార్పొరేటర్ శ్రీవాణి



కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ శ్రీవాణి

హుడాకాంప్లెక్స్: స్థానిక సమస్యలు వెంటనే పరిష్కరించాలని సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి సర్కిల్ అధికారులను కోరారు. మంగళవారం డివిజన్ పరిధి పోచమ్మబాగ్, వేంకటేశ్వర కాలనీ రోడ్ నం.16ను కాలనీ సంక్షేమ సంఘాల నాయకులతో కలిసి ఆమె సందర్శించారు. రోడ్లపై ప్రవహిస్తున్న మురుగు నీటిని పరిశీలించి, సీవర్ లైన్ ఫిర్యాదుకు హాజరై సమస్యను సత్వరమే పరిష్కరించాలని జలమండలి, ఇంజినీరింగ్ శాఖల అధికారులను ఆదేశించామని, నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. కార్యక్రమంలో సద్గుణచారి, నర్సింహారెడ్డి, అంజన్‌కుమార్ పాల్గొన్నారు.

ఈజీఎస్ పనులు వినియోగించుకోండి



చింతలపల్లిలో ఈజీఎస్ పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ ఫారుక్‌హుస్సేన్

ఆమనగల్లు: కూలీలకు ఉపాధి కల్పించడానికి చేపట్టిన ఈజీఎస్ పనులను సద్వినియోగం చేసుకోవాలని ఆమనగల్లు ఎంపీడీఓ ఫారుక్‌హుస్సేన్ చెప్పారు. చింతలపల్లి గ్రామంలో మంగళవారం ఎంపీడీఓ.. పల్లెప్రగతి పనులు పరిశీలించారు. అనంతరం ఈజీఎస్ పనులు చేస్తున్న కూలీలతో మాట్లాడారు. వేసవికాలంలో తగిన జాగ్రత్తలు తీసుకొని పనులు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ మంజుల, నాయకులు యాదయ్య తదితరులు ఉన్నారు. అలాగే మాడ్గుల మండలం కాశీగుడెంలో ఎంపీడీఓ రాఘవులు పర్యటించి పల్లెప్రగతి పనులు పరిశీలించారు.

ప్రజలను మభ్యపెడుతున్న ఎమ్మెల్యే



జోడో యాత్రలో మల్‌రెడ్డి రాంరెడ్డి తదితరులు

ఎల్‌బీనగర్: ఎన్నికల ముందు ఒక మాట.. ఎన్నికల తర్వాత మరో మాట మాట్లాడే బీఆర్‌ఎస్ పార్టీని ప్రజలు బొంద పెట్టే రోజు త్వరలోనే వస్తుందని కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. మంగళవారం బీఎన్ రెడ్డినగర్ డివిజన్ ఎస్‌కేడీనగర్, హరిహరాపురం కాలనీలో డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు మకుటం సదాశివుడు ఆధ్వర్యంలో హాత్ సే హాత్ జోడో యాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న మల్‌రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రఘువీరారెడ్డిలు మాట్లాడుతూ.. ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే మాటలతో ప్రజలను మభ్య పెడుతున్నారని, గతంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చేసిన అభివృద్ధి తప్ప ఇంకేమీ కనపడటం లేదన్నారు. 118 జీఓ ద్వారా ఇప్పటి వరకు ఎల్‌బీనగర్‌లో ఎన్ని రిజిస్ట్రేషన్లు జరగాయో తెలిపాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు హామీలిచ్చి, తర్వాత జీఓలు తెచ్చి అందులో మెళికలు పెట్టి ప్రజలను అయోమయానికి గురి చేస్తున్నారని ఆరోపించారు. గతంలో కాంగ్రెస్ పూర్తి అవగాహనతో ప్రజలకు ఉపయోగపడే జీఓలు తెచ్చిందని, తమ పార్టీ అధికారంలోకి వచ్చాక మళ్లీ అలాంటి జీఓలు తీసుకొస్తామని రాంరెడ్డి, రఘువీరారెడ్డి అన్నారు. కార్యక్రమంలో నాయకులు గణేశ్‌రెడ్డి, వినయ్ పటేల్, శివకుమార్, బోడ రాజశేఖర్, రమేష్‌నాయక్, శ్రీపాల్ రెడ్డి, శ్రీనివాస్‌రావు, కిషోర్, సురేందర్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, శ్యామ్‌చరణ్, మంజులరెడ్డి, సంగీత. సౌమ్య, స్వర్ణమాధవి పాల్గొన్నారు.

ఇప్పటికి రూ.66.34 కోట్లు వసూలు

- 'ఎర్లీబర్డ్' పన్ను వసూలు లక్ష్యం రూ.105.62 కోట్లు
- ఇంకా వసూలు కావాల్సింది రూ.39.34 కోట్లు
- ఈ నెలాఖరుతో ముగియనున్న 'ఆఫర్'



ఎల్‌బీనగర్ జోనల్ కార్యాలయం

ఎల్‌బీనగర్: ఆస్తి పన్ను చెల్లింపుదారులకు జీహెచ్‌ఎంసీ ప్రకటించిన 5 శాతం రాయితీ ఈ నెలాఖరుతో ముగియనుంది. ఈ ఆర్థిక సంవత్సరంలో భవన యజమానులు ఒకేసారి పన్ను చెల్లిస్తే జీహెచ్‌ఎంసీ రాయితీని ప్రకటించిన నేపథ్యంలో ఎల్‌బీనగర్ జోనల్ పరిధిలో ఆస్తి పన్ను చెల్లింపుదారులు పన్ను చెల్లించేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. జోన్ పరిధిలో ఈ ఆర్థిక సంవత్సరం ఎర్లీబర్డ్ కింద రూ.105.62 కోట్ల ఆస్తి పన్ను వసూలు లక్ష్యంగా అధికారులు పెట్టుకున్నారు. ఇప్పటి వరకు జోనల్ పరిధిలోని 5 సర్కిళ్ల పరిధిలో రూ.66.34 కోట్లు వసూలు కాగా.. మిగిలిన రూ39.34 కోట్లు ఈ నెల 30లోపు వసూలు చేసి లక్ష్యాన్ని చేరుకుంటామని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

సర్కిళ్ల వారీగా పన్ను వసూలు ఇలా..

- కాప్రా రూ.24.29 కోట్లు లక్ష్యం కాగా.. ఇప్పటి వరకు రూ.14.65 కోట్లు వసూలైంది. మరో రూ.9.64 కోట్లు వసూలు చేయాల్సి ఉంది.
- ఉప్పల్‌లో రూ14.50 కోట్లు లక్ష్యం కాగా.. రూ.9.51 కోట్లు వసూలైంది. మరో రూ.4.98 కోట్లు వసూలు చేయాల్సి ఉంది.
- ఎల్‌బీనగర్ సర్కిల్– 3లో రూ.23.54 కోట్లు లక్ష్యం కాగా, ఇప్పటి వరకు రూ.14.79 కోట్లు వసూలైంది. ఇక్కడ లక్ష్యాన్ని చేరుకోవాలంటే రూ.8.75 కోట్లు వసూలు చేయాల్సి ఉంది.
- ఎల్‌బీనగర్ సర్కిల్– 4లో రూ.20.17 కోట్లు లక్ష్యం కాగా, ఇప్పటి వరకు రూ.12.08 కోట్లు వసూలైంది. ఈ నెలాఖరుకు మరో రూ.8.09 కోట్లు వసూలు లక్ష్యంగా అధికారులు ముందుకు సాగుతున్నారు.
- ఎల్‌బీనగర్ సర్కిల్– 5లో రూ.23.18 కోట్లు లక్ష్యం కాగా, రూ.15.31 కోట్లు వసూలైంది. ఇంకా రూ.7.88 కోట్లు రావాల్సి ఉంది.

ఎర్లీబర్డ్ లక్ష్యాన్ని చేరుకుంటాం: డీసీలు

ఈ ఆర్థిక సంవత్సరం ఎర్లీబర్డ్ కింద కల్పించిన 5 శాతం రాయితీని ఎల్‌బీనగర్ వాసులు సద్వినియోగం చేసుకోవాలని ఆయా సర్కిళ్ల డీసీలు మారుతి దివాకర్, సురేందర్‌రెడ్డి, కృష్ణయ్య విజ్ఞప్తి చేశారు. తమకు ఇచ్చిన లక్ష్యాన్ని ఈ నెల చివరి వరకు పూర్తి చేసేందుకు సిబ్బందితో పాటు తాము భవన యజమానులకు పన్ను చెల్లించేలా అవగాహన కల్పిస్తున్నామన్నారు.

వైభవంగా లక్ష్మీనారాయణస్వామి కల్యాణోత్సవం



కల్యాణాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కే పురం డివిజన్ వాసవీ కాలనీలోని అష్టలక్ష్మి ఆలయ 27వ బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా 5వ రోజైన మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవమూర్తులకు వేద బ్రాహ్మణుల మంత్రోచ్చారణల మధ్య అభిషేకాలు నిర్వహించారు. సోమవారం రాత్రి ఆలయంలో శ్రీ లక్ష్మీ నారాయణస్వామి కల్యాణోత్సవం కనుల పండువగా జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై కల్యాణోత్సవాన్ని తిలకించారు. ఈ సందర్భంగా ఆలయంలో భగవద్రామానుజుల వారి జయంతి (చందనగోష్టి) నిర్వహించారు. అనంతరం భక్తుల కోలాహలం మధ్య సింహ వాహన సేవ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా కాలసర్ప దోషనివారణకు శ్రీవరాహేష్టి నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సోమ సురేష్, ఫౌండర్ చైర్మన్ గౌరిశెట్టి చంద్రశేఖర్ గుప్తా, కమిటీ సభ్యులు చిలుక ఉపేందర్‌రెడ్డి, గంప జగన్, గౌరిశెట్టి అరుణ్, బాలగోపాల్, బొగ్గారపు పాల్గొన్నారు.